క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నేతలు

షాద్‌నగర్ టౌన్: స్థానిక పదో వార్డులోని గాయత్రీ కాలనీ అభివృద్ధి కమిటీని బీఆర్‌ఎస్ పార్టీ నేత జమ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడిగా రాంరెడ్డి, అధ్యక్షుడిగా దయానంద్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా చందు, ఉపాధ్యక్షులుగా బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రాంరెడ్డి, కోశాధికారిగా బంగారు కృష్ణయ్య, విద్యా సలహాదారుడిగా శంకరయ్య గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా పెంటయ్య, వెంకటేషను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

బీమా చెక్కు అందజేత



బాలరాజుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: మున్సిపల్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన గడ్డం ప్రసన్న లక్ష్మి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆమె బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్త కావడంతో పార్టీ నుంచి రూ. 2లక్షల బీమా మంజూరు అయ్యింది. ఇందుకు సంబంధించిన చెక్కును శుక్రవారం మృతురాలి భర్త గడ్డం బాలరాజుకు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, కౌన్సిలర్ జూపల్లి కౌసల్య, జూపల్లి శంకర్, సర్వర పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇబ్రహీం



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఇబ్రహీం

షాద్‌నగర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇబ్రహీం కోరారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని, తరగతి గదులు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో కనీస సదుపాయాల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని ఆరోపించారు. పాఠశాలలకు సరైన ప్రహరీ లేకపోవడంతో ఆకతాయిలు వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన జరగాలని కోరారు.

పత్తి తూకాల్లో మిల్లర్ల మోసాల్ని అరికట్టాలి

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పర్వతాలు

కొత్తూరు: పత్తి తూకాల్లో అక్రమాలకు పాల్పడుతున్న పలు కాటన్ మిల్లుల యజమానులపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు శుక్రవారం డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టించిన రైతులు తమ పంటలను విక్రయించడానికి మిల్లుల వద్దకు వెళ్తే కొందరు యజమానులు తూకాల్లో మోసాలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. మరికొన్ని మిల్లుల నిర్వాహకులు సరైన నాణ్యత లేదని, ఇతర కారణాలు చూపుతూ రైతులకు తక్కువ ధర చెల్లిస్తున్నట్లు ఆరోపించారు. అధికారులు పత్తిని కొనుగోలు చేస్తున్న మిల్లుల సమీపంలో ఉండే వే బ్రిడ్జిలను తనిఖీలు చేయాలన్నారు.

సామూహిక కుంకుమార్చన

మొయినాబాద్: మండలంలోని సురంగల్ కట్ట మైసమ్మ ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన చేశారు. సర్పంచ్ గడ్డం లావణ్య, మాజీ సర్పంచ్ అవుసుల లావణ్య, మాజీ ఉప సర్పంచ్‌లు గడ్డం అంజిరెడ్డి, జైపాల్‌రెడ్డి, నాయకులు భాస్కరాచారి, వెంకట్‌రెడ్డి, యాదగిరి చారి, అశోక్‌గౌడ్, పాండురంగారెడ్డి, రాము పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

షాద్‌నగర్ టౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ తాండ్ర విశాల అన్నారు. శుక్రవారం మండలంలోని కిషన్‌నగర్ జగద్గురు పంచాచార్య వీరశైవ ఆగమ సంస్కృత వేద పాఠశాలలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో తాండ్ర శ్రవణ్‌రెడ్డి, వేద పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపుపై నిరసన వెల్లువ



షాద్‌నగర్ ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



చేవెళ్లలో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు, పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

- ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నేతలు
- పెంచిన ధరలు తగ్గించాలని డిమాండ్
- సామాన్యులపై భారం వేయడం సరికాదని హితవు
- ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

చేవెళ్ల: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదలను మోసం చేస్తూనే ఉందని, ఇప్పుడు గ్యాస్ ధరలను పెంచి మరోసారి సామాన్యుల నడ్డివిరిచిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్లలో శుక్రవారం చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ మండలాల బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా ధర్నా నిర్వహించారు. ప్రధాన మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తోందన్నారు. నేతలు, నాయకులు విజయలక్ష్మి, గోవర్ధన్‌రెడ్డి, మాలతి, శ్రీకాంత్, నక్షత్ర, గోవిందమ్మ, బాల్‌రాజ్, వెంకటరంగారెడ్డి, పాపరావు పాల్గొన్నారు.

గ్యాస్ ధర తగ్గించాలి

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. గ్యాస్ సిలిండర్ ధరల పెంపును నిరసిస్తూ శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వంట గ్యాస్ సిలిండర్ ధరల పెంపుతో సామాన్యులపై పెను భారం పడిందన్నారు. వివిధ రాష్ట్రాల ఎన్నికలు పూర్తి కాగానే వంట గ్యాస్ ధరలను పెంచడాన్ని చూస్తుంటే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కుటిల బుద్ధి అర్థమవుతోందన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేదలను ఆదుకోవాల్సిన కేంద్రం అడ్డగోలుగా గ్యాస్ ధరలను పెంచడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, ఎంపీపీ ఖాజా ఇద్రీస్, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, అగ్గనూరు విశ్వం, వంకాయల నారాయణరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిలిండర్ ధరలు తగ్గించాలి

నందిగామ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన నందిగామలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నోముల పద్మారెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఈట గణేశ్ హాజరై కేంద్రం తీరుపై విరుచుకు పడ్డారు. రోజురోజుకు సిలిండర్ ధరలను పెంచుతూ పేదల నడ్డి విరుస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. దేశంలోని పేదల ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని పెంచిన ధరలను వెంటనే తగ్గించాలన్నారు. అనంతరం నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

కొత్తూరు: నిత్యావసరాల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ మండల నాయకులు ఆరోపించారు. వంట గ్యాస్ సిలిండర్ ధర పెంపునకు నిరసనగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ... డొమెస్టిక్ సిలిండర్‌పై రూ. 50, కమర్షియల్ సిలిండర్‌పై రూ. 350 పెంచడం దారుణమన్నారు. ధరల పెంపుతో సామాన్యులు, పేదలపై ఆర్థిక భారం పడిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మెండె కృష్ణ, దేవేందర్ యాదవ్, కోస్గి శ్రీనివాస్, డోలీ రవీందర్, యాదగిరి, గోపాల్ నాయక్, రవినాయక్, రవీందర్‌రెడ్డి, అంజనేయులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

కేశంపేట: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని ఎంపీపీ ఏ రవీందర్ యాదవ్ కోరారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ శుక్రవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ... నిత్యావసర సరుకుల ధరలను పెంచి కేంద్ర ప్రభుత్వం పేదల నడ్డి విరిచిందన్నారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, నాయకులు వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, జమాల్ ఖాన్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొందుర్గు మండలంలో..

కొందుర్గు: పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వంట గ్యాస్ ధరలను పెంపును నిరసిస్తూ శుక్రవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు సిలిండర్లతో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, సయ్యద్ హఫీజ్, నాయకులు గోపాల్, రామకృష్ణ, యాదయ్య, నర్సింహారెడ్డి, శ్రీకాంత్ గౌడ్, మానయ్య, రవీందర్ యాదవ్, వెంకటయ్య, జగదీశ్వర్ గౌడ్, సత్యప్రమోద్ రావు, దూలయ్య, జాహంగీర్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

రేపు గురుకుల ప్రతిభా కళాశాలలో ప్రవేశ పరీక్ష

షాద్‌నగర్ రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల(సీఓఈ)లో ప్రవేశానికి ఈ నెల 5వ తేదీ పరీక్ష నిర్వహించనున్నట్లు కమ్మదనం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు 2023 - 24 విద్యా సంవత్సరంలో ప్రతిభా కళాశాల (సీఓఈ)లో ప్రవేశానికి ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల కమ్మదనం గురుకుల కళాశాల పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థినులు హాల్ టికెట్, పెన్సిల్, బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్, బోన ఫైడ్, ఆధార్ కార్డు, పరీక్ష ప్యాడ్, మాస్క్ తెచ్చుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరని తెలిపారు. హాల్ టికెట్, ఓఎంఆర్‌లో ఎటువంటి తప్పులు ఉన్నా సవరించుకోవడానికి తప్పని సరిగా బోన ఫైడ్‌ను సంబంధిత పాఠశాల నుంచి తెచ్చుకోవాలన్నారు. పరీక్ష కేంద్రానికి వచ్చేవారు షాద్‌నగర్ బస్టాండ్ నుంచి కమ్మదనం బైపాస్ మీదుగా బస్సు, ఆటోల్లో సిల్క్ ఫాం పక్కన ఉన్న కమ్మదనం గురుకుల కళాశాలకు చేరుకోవచ్చని సూచించారు.

చెరువులు, కుంటలకు మరమ్మతులు చేపట్టాలి

నందిగామ: మండలంలోని చేగూరు గ్రామ శివారులో గల చెరువులు, కుంటల కట్టలు శిథిలావస్థకు చేరాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామానికి చెందిన మంకాల శ్రీశైలం శుక్రవారం ఇరిగేషన్ ఈఈకి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామ శివారులోని మొదేం కుంట, ఒరం బాయి చెరువు, కర్ణం కుంట కట్టలు శిథిలావస్థకు చేరాయన్నారు. కట్టలపై పిచ్చి మొక్కలు పెరగడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆయన కోరారు.

‘కంటి వెలుగు’ పేదలకు వరం



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకన్న

మున్సిపల్ కమిషనర్ వెంకన్న

షాద్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం పేదలకు వరమని మున్సిపల్ కమిషనర్ వెంకన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని 27వ వార్డు తిరుమల కాలనీలో కౌన్సిలర్ జూపల్లి కౌసల్య ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పేదల కంటి సమస్యలతో ఇబ్బంది పడరాదనే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దృష్టి లోపం ఉన్న వారిని గుర్తించి కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సమస్య తీవ్రంగా ఉన్న వారిని గుర్తించి హైదరాబాద్‌లోని సరోజిని ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జూపల్లి శంకర్, రఘు పాల్గొన్నారు.

భక్తి మార్గంతోనే మానసిక ప్రశాంతత



దుర్గామాత ఆలయం వద్ద ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, భక్తులు

- ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, అంజయ్య యాదవ్

శంకర్‌పల్లి: ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలాంఖాన్‌గూడలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలన్నారు. భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. గ్రామాల్లోని పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలోఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్, మున్సిపల్ అధ్యక్షుడు ఖన్నా, యువజన విభాగం మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్‌లు, నాయకులు శ్రీనివాస్, నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పావని, ప్రవీణ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, శ్రీధర్, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

కొత్తూరు: ఆధ్యాత్మికత అలవార్చుకునే వారికి మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండలంలోని గూడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశీ విశ్వేశ్వర ఆలయ ప్రారంభోత్సవంలో ఆయన శుక్రవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయాలు హిందూ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గణేష్, ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, నాయకులు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

శంకర్‌పల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. పేర్కొన్నారు. శుక్రవారం చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శంకర్‌పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు షేక్ వసీం బీఆర్‌ఎస్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫరీద్ ఆధ్వర్యంలో పార్టీలో చేరాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. బీఆర్‌ఎస్ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కావలి గోపాల్, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, గాజులగూడ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మాణిక్యం, ఖాజా, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

షాద్‌నగర్ రూరల్: విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి వారికి పాఠాలు బోధించారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం సక్కుబాయి ఆధ్వర్యంలో శుక్రవారం స్వయం పరిపాలనా దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్‌గా అక్షయ, డీఈఓగా ప్రణతి, డిప్యూటీ డీఈఓగా ప్రవీణ్, ఎంఈఓగా హన్సిక, హెచ్‌ఎంగా శివాణి, ఓఎస్‌గా బాబు, ఉపాధ్యాయులుగా హన్సిక, సౌమ్య, దీక్ష, వైశాలి, కృష్ణవేణి, తనుశ్రీ, తేజస్విని, సాయిగణేష్, అఖిల్, శివసాయి, సాయిచరణ్, జగదీష్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు శ్రీదేవి, అరుణ, జ్యోతిలక్ష్మి, గీతమ్మ, బుగ్గమ్మ, భాగ్యలక్ష్మి, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



రైతులకు వ్యవసాయ పరికరాలు అందజేస్తున్న ఆనంద్‌కుమార్ తదితరులు

బీజేపీ సీనియర్ నాయకుడు ఆనంద్‌కుమార్

కేశంపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు పల్లె ఆనంద్ కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని కొండారెడ్డిపల్లిలో 30 మంది దళిత రైతులకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైజ్ రీసెర్చ్ సెంటర్ ద్వారా వివిధ రకాల వ్యవసాయ పరికరాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులతో పాటు సబ్బండ వర్గాల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక సబ్సిడీ పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శివ, నాయకులు విజేందర్ రెడ్డి, రాజు, లక్ష్మయ్య, లక్ష్మణ్, వెంకటయ్య, అశన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల చలో కలెక్టరేట్



చలో కలెక్టరేట్ కార్యక్రమానికి బయలుదేరిన అంగన్‌వాడీలు

చేవెళ్ల: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో చేవెళ్ల నుంచి కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు ఏళ్ల తరబడిగా పనిచేస్తున్నా వారి కనీస సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం, పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, యూనియన్ జిల్లా కోశాధికారి లక్ష్మీ, నాయకులు స్వప్న, అనిత తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ

షాబాద్: గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పెద్దవేడు గ్రామ సర్పంచ్ గౌండ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం గ్రామంలో పంచాయతీ నూతన భవనానికి టీపీసీసీ మాజీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి 400 గజాలు ఇవ్వడంతో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పంచాయతీ భవన నిర్మాణానికి స్థలం ఇచ్చిన నరేందర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, గ్రామస్తులు నర్సింహులుగౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, రఘుపతి రెడ్డి, మహేందర్, అనంత్, నర్సయ్య, గోవర్ధన్‌రెడ్డి, సూర్యకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను కొట్టడం సరికాదు

బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి

కొందుర్గు: విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయుడిని వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం చౌదరిగూడ గురుకుల పాఠశాలను బీజేపీ నాయకులు సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. పాఠశాలలో పనిచేస్తున్న రాజేశ్వర్ అనే ఉపాధ్యాయుడు చదువు పేరుతో తమను కొడుతున్నట్లు వాపోయారు. ఓ విద్యార్థి ఉపాధ్యాయుడు కొట్టిన దెబ్బలను చూపించారు. విష్ణువర్ధన్ రెడ్డి స్పందించి పిల్లలను కొట్టే హక్కు ఉపాధ్యాయులకు లేదన్నారు. ఆయనపై చర్య తీసుకోవాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీశైలాన్ని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు, నాయకులు కోనేరు శ్రీనివాసు, మల్లేష్, రాజు, భీమయ్య, ప్రభు, అంజయ్య, శేఖర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం

కేశంపేట: మండలంలోని నిర్దవెళ్లి గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ కూతురు వివాహానికి పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పదివేల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈశ్వరమ్మ ఆర్థిక పరిస్థితిని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన నగదు అందజేశారు. ఈ సాయాన్ని శుక్రవారం గ్రామ కమిటీ సభ్యులు ఈశ్వరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, ముత్యాలు, జంగయ్య, రాములు, రామకృష్ణ, శ్రీశైలం, ఖాజా పాష, మల్లేష్, సత్యం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందుండాలి

విద్యా జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ సాయిబాబారెడ్డి



ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల సిబ్బంది

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని, అప్పుడే విజ్ఞానం పొందుతారని విద్యా జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ సాయిబాబారెడ్డి అన్నారు. మండలంలోని హిమాయత్‌నగర్ విద్యా జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్, ఫినిక్స్ ఫెస్ట్ నిర్వహించారు. శుక్రవారం ముగింపు సమావేశంలో సాయిబాబారెడ్డి పాల్గొని వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ శ్రీనివాసులు, ఓబులేష్, రమేష్‌బాబు, సుజాత, కళాశాల అడ్మిని స్ట్రేటివ్ ఏవో వెంకటచలం, అకాడమీ కోఆర్డినేటర్ శ్రీలత, పీఆర్వో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల మేలు కోసమే కమిటీలు

చేవెళ్ల: రైతులకు మార్కెట్‌లో మద్దతు ధర కల్పించి వారికి ఎప్పుడు అండగా ఉండేందుకు కమిటీలు సహకరిస్తాయని రేగడిఘనాపూర్ సర్పంచ్ ఆర్ నర్సింలు అన్నారు. మండలంలోని రేగడిఘనాపూర్‌లో శుక్రవారం రైతులకు నాబార్డు, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రైతు కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కమిటీ సభ్యులుగా ఉన్న రైతులకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో పలు రకాల సేవలు అందుతాయన్నారు. రైతులు పండించిన పంటలు నేరుగా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.

బోర్డు తొలగింపుపై ఫిర్యాదు

కొత్తూరు: తమ వ్యాపార సముదాయం ముందు ఏర్పాటు చేసుకున్న ప్రచార బోర్డును మున్సిపల్ అధికారులు కావాలనే తొలగించారని తిమ్మాపూర్‌కు చెందిన శ్రీనివాస్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన కథనం మేరకు.. కొత్తూరు వైజంక్షన్ కూడలిలో తాను బైక్స్ షోరూం నిర్వహిస్తున్నట్లు తెలిపాడు. అయితే కావాలనే మున్సిపల్ సిబ్బంది బోర్డులు తొలగించినట్లు వివరించారు. దీనిపై విచారణ జరపాలని ఆయన కోరారు.

బీజేపీతోనే సుస్థిరపాలన

షాబాద్: బీజేపీతోనే సుస్థిరపాలన సాధ్యమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మస్‌మర్రి గ్రామంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ హామీల అమల్లో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కిరణ్, సర్పంచ్ సుహాసిని సత్యనారాయణ, ఉపసర్పంచ్ గోపాల్, నాయకులు వెంకటేష్, చంద్రశేఖర్, శంకరయ్య పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం

కేశంపేట: మండల కేంద్రంలోని అమృత లింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ డైరెక్టర్ మఠం చంద్రశేఖర్, చందన దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం పండితుల వేద మంత్రోచ్ఛారణ మధ్య కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విశ్వనాథం, నాయకులు యాదయ్య, శివకుమార్, పశుపతినాథ్ తదితరులు పాల్గొన్నారు.